సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం | 20 | అక్టోబర్ | 2023



రాష్ట్రస్థాయిలో 'విజయ దుందుభి'

రాష్ట్రస్థాయి 10వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా పేరు మార్మోగింది. ఈ పోటీల్లో జిల్లా బాలికలు, బాలుర జట్లు సత్తా చాటాయి. - IIలో



నిందితులకు శిక్ష పడాలి

పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. - IIలో



డీసీసీబీలో విజయోత్సవాలు

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వ్యాపార లావాదేవీల టర్నోవర్ రూ.2 వేల కోట్ల మైలురాయి దాటింది. బ్యాంకు సిబ్బంది విజయోత్సవాలు జరుపుకున్నారు. - IIలో

న్యూస్‌రీల్

విధుల్లో పోలీస్ డాగ్



పోలీస్ డాగ్‌తో ఎస్పీ విక్రాంత్ పాటిల్, సిబ్బంది

పార్వతీపురంటౌన్: రాష్ట్ర పోలీస్ ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి సీటీసీ శిక్షణ కేంద్రంలో 9 నెలలు శిక్షణ అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించిన నార్కోటిక్స్ ట్రాకింగ్ డాగ్ మ్యాక్స్ గురువారం విధుల్లో చేరింది. డాగ్ హ్యాండ్లర్లు జిల్లా కేంద్రానికి చేరుకొని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మ్యాక్స్‌కు స్వాగతం పలికారు. మ్యాక్స్ ఆరోగ్యం, శిక్షణ నైపుణ్యాన్ని హ్యాండలర్లు కె.రామారావు, వి.బలరాంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'వజ్రభారతి గేయ హారతి' పుస్తకం ఆవిష్కరణ



'వజ్రభారతి-గేయ హారతి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పి.దేవానంద్, ఎల్విన్‌పేట ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు పి.నిర్మలకుమార్ సంయుక్తంగా గురువారం రచించిన 'వజ్రభారతి-గేయ హారతి' పుస్తకాన్ని డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ గురువారం పి.లేవిడి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులను చైతన్యవంతుల్ని చేసేలా ఏజన్సీ ప్రాంతానికి చెందిన రచయితలు పుస్తకాలు రచించడం సంతోషదాయకమన్నారు. రచయితలను అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌మార్ పాల్గొన్నారు.

భామినిలో వర్షం



భామినిలో కురుస్తున్న వర్షం

భామిని: మండలంలో బుధవారం రాత్రి వర్షం కురిసింది. మండుతున్న ఎండలకు పంటలు ఎండిపోతున్న దశలో కురిసిన వర్షంతో రైతులు ఊరటచెందారు. ఖరీఫ్ వరి పంటకు వర్షం ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.

ముగ్గురు ఆర్డీఓలకు బదిలీ

- విజయనగరం ఆర్డీఓగా దాట్ల కీర్తి
- చీపురుపల్లి ఆర్డీఓగా బి.శాంతి
- బొబ్బిలి ఆర్డీఓగా సాయిశ్రీ



దాట్ల కీర్తి, విజయనగరం ఆర్డీఓ



బి.శాంతి, చీపురుపల్లి ఆర్డీఓ

విజయనగరం అర్బన్: జిల్లాలోని ముగ్గురు ఆర్డీఓలను బదిలీచేస్తూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం ఆర్డీఓగా పీడీసీలో వెయిటింగ్‌లో ఉన్న దాట్ల కీర్తికు పోస్టింగ్ ఇచ్చారు. ఆమెకు జిల్లాలో వివిధ కేడర్లలో పనిచేసిన అనుభవం ఉంది. జిల్లాలోని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా, సర్వశిక్ష ఏపీసీగా విధులు నిర్వహించి అప్పట్లో ఉత్తమ అధికారిగా ప్రశంసలు అందుకున్నారు. ఇంతవరకు ఇక్కడ పనిచేస్తున్న ఎం.సూర్యకళకు శ్రీకాకుళం ఆర్‌డీఓగా బదిలీ అయింది. భోగాపురం ఎయిర్‌పోర్టు భూసేకరణ నేపథ్యంలో నిర్వాసితులకు కేటాయించిన కాలనీల నిర్మాణం పూర్తిచేయడంలో ఆమె కీలకభూమిక పోషించారు. బొబ్బిలి ఆర్డీఓగా పీడీసీలో వెయిటింగ్‌లో ఉన్న ఆదిమూలం సాయిశ్రీకి పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పి.శేషశైలజను జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి పంపించారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి 560 ఎకరాల భూసేరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతిని చీపురుపల్లి ఆర్డీఓగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.అప్పారావును జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు పంపారు.

అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

- మంచిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు
- రాష్ట్ర ప్రజలు గర్వపడేలా పాలన
- సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



కొమ్మినేనిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని గుర్తుచేశారు. సీఆర్‌ఏపీ మీడియా అకాడమీ, ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్-పాలన సంస్కరణలు- మెరుగైన పౌరసేవలపై' పార్వతీపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ హాల్‌లో గురువారం సదస్సు జరిగింది. దీనికి ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి కొమ్మినేని జ్యోతి ప్రజ్వలనచేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంగా ఉన్న పార్వతీపురాన్ని పాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లాగా చేశారన్నారు. ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకువెళ్లే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల ముంగిటకే ప్రభుత్వాన్ని తీసుకువచ్చి సుపరిపాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. గత 40 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేతమైన, విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకొని అర్హతే ప్రామాణికంగా కుల, మత వర్గ రాజకీయాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందించి విమర్శలకు తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న విధానాన్ని వివరించారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పేదలకు మేలు చేసేవారే నిజమైన నాయకులని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రతి ఇంటి తలుపు తట్టి వైద్యసేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయన్నారు. అవ్వా, తాతలను, తల్లిదండ్రులను గౌరవించేలా ఇళ్లవద్దకే పింఛన్ అందించేందుకు నాంది పలికిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు.

తేడా గుర్తించండి...

ప్రజలు మెచ్చేపాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిను ప్రతిఒక్కరూ మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. గత టీడీపీ జన్మభూమి కమిటీల పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిపాలన మధ్య తేడాను గుర్తించాలన్నారు. గత 52 నెలలుగా ఇంటి వద్దకే పాలనను తీసుకురావడం సుపరిపాలనకు నిదర్శనంగా కొనియాడారు. పేద, బడుగు, అట్టడుగు, బలహీన వర్గాలతో పాటు అందరికీ సంక్షేమ పాలనను అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆర్టికల్ 13, 17లను నిజంచేసి నెహ్రూ ఆలోచనలు, అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఊరిలోనే నిర్మించి అన్ని సేవలను ప్రజలకు చేరువచేసిందన్నారు. 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, ఆంగ్ల భాషలో విద్య, నాడు-నేడు పేరుతో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు, వచ్చేజనవరి నుంచి రూ.3వేల పింఛన్ వంటి అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. అర్హత ప్రామాణికంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అనంతరం చుక్కవానివలస, నిమ్మవలస, పాట్టిగడపవలస గిరిపుత్రులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ ప్రకాష్, ప్రకృతి వ్యవసాయం, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, ఎంపీపీ మజ్జి శోభారాణి, ఎంఈఓ సామల సింహాచలం, ఉపాధ్యాయులు తిరుపతిరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు

పరిశ్రమలను తీసుకురావాలన్న ఉద్దేశంతో 4 పోర్టులు, 9 హార్బర్లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోందని కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. విశాఖలో రూ.15వేల కోట్లతో ఇన్ఫోసిస్, ఫార్మాకంపెనీల ఏర్పాటు, రామాయపట్నం వద్ద రూ.45వేల కోట్లతో సోలార్ ప్రాజెక్టు వంటివి రాబోతున్నాయని, దీంతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఉద్దానం, కిడ్నీ బాధితుల కోసం పలాసలో కిడ్నీ ఆస్పత్రితో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఉద్దానం ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. రాష్ట్రంలో ఇన్ని మంచి కార్యక్రమాలు జరుగుతున్నా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని గమనించి మంచిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

9,522 మందికి రూ. 9.52 కోట్ల లబ్ధి



జగనన్న చేదోడు నమూనా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు, తదితరులు

- కులవృత్తుల వారికి 'జగనన్న తోడు'
- అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- లబ్ధిదారులకు చెక్కు అందజేసిన జేసీ గోవిందరావు

పార్వతీపురం: జగనన్న చేదోడు పథకం కింద కుల వృత్తులు చేసుకునే రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు నాలుగోవిడత ఆర్థిక సహాయాన్ని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వేదికగా సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ నుంచి జేసీ గోవిందరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, షాపులున్న రజకులకు, నాయీ బ్రాహ్మనులు, టైలరింగ్ వృత్తిచేసేవారికి రూ.10వేలు చొప్పున, ఐదేళ్లకు రూ.50వేలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో నాల్గవ విడతగా 2,969 మంది రజకులకు రూ. 2,969 కోట్లు, 1090 మంది నాయీ బ్రహ్మణులకు రూ.1,090 కోట్లు, 5,463 మంది టైలర్లకు రూ.5,463 కోట్లు వెరసి 9,522 మంది లబ్ధిదారులకు రూ.9.5 కోట్లను వారి ఖాతాలకు జమచేసినట్టు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. మూడు విడతల్లో జిల్లాలో 8,266 రజకులకు రూ.826.60 లక్షలు, 3,209మంది నాయీ బ్రహ్మణులకు రూ.320.90లక్షలు, 10,729 మంది టైలరింగ్ వృత్తివారికి రూ.1072.90 లక్షలు చొప్పున రూ.22,204 మంది లబ్ధిదారులకు రూ. 2220.40లక్షలు పంపిణీ చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు జేసీ గోవిందరావు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ ఆర్.రమాదేవి, తూర్పుకాపు, కళింగవైశ్య, రజక, శెట్టిబలిజ, కూరాకుల, తెలుకల కార్పొరేషన్ డైరెక్టర్లు మజ్జి నాగమణి, ఎల్.మెహర్ ప్రసాద్, జి.జనార్దన్, ఎస్.తిరుపతి, పి.తిరుపతిరావు, సీహెచ్. వెంకటరమణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణ చర్యలు భేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో రక్తహీనత నివారణకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు భేష్‌గా ఉన్నాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డి అన్నారు. జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, శిశుసంక్షేమశాఖ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. బాలికలు, బాలింతలు, శిశువులలో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను అధిగమించేందుకు వైద్య, విద్యా, మహిళా శిశుసంక్షేమ శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి రక్తహీనత, పోషకాహర లోపం ఉన్నవారిని గుర్తించి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందిస్తున్నట్టు వెల్లడించారు. ప్రతినెలా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, మెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. నాడు-నేడు పనుల ద్వారా పాఠశాలకు మంచినీరు, మరుగుదొడ్లు, వసతి కల్పించడం జరిగిందని, పదోతరగతి ఫలితాలలో రాష్ట్రంలోనే ఉత్తమ ఉత్తీర్ణతాశాతం సాధించినట్టు వెల్లడించారు. టీకా కార్యక్రమం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

జేఏఎస్ శిబిరం పరిశీలన



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

కొమరాడ: మండలంలోని చినఖేర్జల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డీఐఓ జగన్‌మోహన్‌రావు గురువారం పరిశీలించారు. గ్రామీణప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, వైద్యాధికారి సీహెచ్ అరుణ్‌కుమార్, సర్పంచ్ గంగారావు, వైస్ సర్పంచ్ టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఊరి చెంతనే వైద్యం



పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుమలప్రసాద్

పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ఊరిచెంతనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో వైద్యశిబిరాలకు వచ్చిన వారందరికీ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నట్టు వెల్లడించారు. పిల్లల్లో పుట్టుకలోపాలు గుర్తించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జేఏఎస్ శిబిరాల నిర్వహణ ఇలా...

పీహెచ్‌సీ	శిబిరం నిర్వహించే ప్రాంతం
గరుగుబిల్లి	పెద్దూరు ఎంపీపీ స్కూల్
తాడికొండ	లుంబేసు గ్రామ సచివాలయం
కొమరాడ	చోళ్లపదం గ్రామ సచివాలయం
మొండెంఖల్	పి.లేవిడి ఎయిడెడ్ పాఠశాల
అన్నవరం	బాసూరు గ్రామ సచివాలయం
బందలుప్పి	నర్సిపురం-2 జెడ్పీహెచ్ఎస్
దోనిబాయి	మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
సీతానగరం	కాశీపేట ఎంపీపీ పాఠశాల
వీరఘట్టం	దశమంతపురం గ్రామ సచివాలయం
బలిజిపేట	నూకలవాడ పాఠశాల
జియ్యమ్మవలస	శిఖబడి గ్రామ సచివాలయం

జిల్లాలో జేఏఎస్ శిబిరాల్లో గురువారం అందించిన సేవలు ఇలా...

మండలాలు	15
వైద్యశిబిరాలు	15
మొత్తం ఓపీలు	7,810
స్పెషలిస్టుల ఓపీలు	3,055
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	4,628
డీఎం	834
హెచ్‌టీఎన్	1,316
ఏఎన్‌సీ	142
పీఎన్‌సీ	78
అనీమియా	125
ల్యాబ్‌టెస్టులు	4,295
ఈసీజీ పరీక్షలు	163
రిఫరల్ కేసులు	103

రూ.2లక్షల35వేల కోట్లతో...
ప్రజాసంక్షేమం



వైఎస్సార్‌సీపీ గజపతినగరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- నాలుగున్నరేళ్లల్లో పేదల్లో స్పష్టంగా కనిపిస్తున్న ఆర్థికోన్నతి
- అభివృద్ధి పనులకు ప్రాధాన్యం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

బొండపల్లి: దేశంలోనే మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా ప్రజా సంక్షేమ పథకాల కోసం రూ.2లక్షల35 వేల కోట్లను వెచ్చించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలోని సత్య ఫంక్షన్‌హాల్ ఆవరణలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయిలో సమావేశం జరిగింది. సభకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.15 లక్షల కుటుంబాలకు, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేసినట్టు వెల్లడించారు. ఆర్థిక లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చేరుతోందన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోనే నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి పనులకు రూ.1750 కోట్లు వెచ్చించినట్టు వెల్లడించారు. నాడు-నేడు కింద ప్రభుత్వ స్కూళ్లను ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్యసేవలు అందించడం చెప్పుకోదగ్గ అంశమన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి ముందుచూపునకు నిదర్శనమన్నారు. ఎన్నికలకు మరో ఆరు నెలలు మాత్రమే సమయం ఉందని, పచ్చమీడియా, టీడీపీ నాయకుల తప్పుడు విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగన్ రాష్ట్రానికి మళ్లీ ఎందుకు కావాలి కార్యక్రమంతో పాటు సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈనెల 26న ఉత్తరాంధ్రలో బస్సుయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. 27న గజపతినగరంలో సాగుతుందన్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లోనూ 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి?' అన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కార్యక్రమంలో ప్రభుత్వవిప్ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాలు పథక అమలు చైర్మన్ ఎ.నారాయణమూర్తి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీరాజు, ఎం.నారాయణమూర్తిరాజు, బొండపల్లి, దత్తిరాజేరు, గంట్యాడ, గజపతినగరం, జామి మండలాల ఎంపీపీ చల్లా చలంనాయుడు, గేదేల సింహాద్రి అప్పలనాయుడు, పీరుబండి హైమావతి, బెల్లాన జ్ఞాన దీపిక, సబ్బవరపు అరుణ, బొండపల్లి, దత్తిరాజేరు, గంట్యాడ, జామి మండలాల జెడ్పీటీసీ సభ్యులు రాపాక సూర్యప్రకాశరావు, రౌతు రాజేశ్వరి, వర్రి నర్సింహమూర్తి, గొర్లె సరయు, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, గంట్యాడ, జామి మండలాల వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, రాపాక కృష్ణార్జున, బూడి వెంకటరావు, రంధి రామునాయుడు, గొర్లె రవికుమార్, బొండపలి వైస్ ఎంపీపీ మీసాల సరోజిని పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట



అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో చట్ట సభల్లోని అన్ని పదవులతో పాటు, సంక్షేమ పథకాల అమలులోనూ ప్రాధాన్యమిస్తున్నారు. ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమచేయిస్తున్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి ప్రపంచంతో మన విద్యార్థులు పోటీపడేలా చదువు ప్రణాళికలు అమలుచేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

జగన్ పాలనలోనే పేదలకు మేలు



జిల్లాతో పాటు, రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి మేలు జరిగిందంటే అది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాలనలో మాత్రమే. గత టీడీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు మేలుచేసింది లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లాకు జేఎన్‌టీయూ గురజాడ వర్సిటీ, మెడికల్ కళాశాల, గిరిజన వర్సిటీ, భోగాపురం విమానాశ్రయం వంటివి సాకారమయ్యాయి. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రతి గడపకు వివరించాలి.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

పోలీసులకు ప్రశంసలు



ట్రాఫిక్ హెచ్‌సీ చింతకాయల వెంకటరావును అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: భద్రతా విధుల్లో ప్రతిభ కనబర్చిన పోలీసులను ఎస్పీ ఎం.దీపిక గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను అందజేశారు.

అవార్డులు అందుకున్న వారి వివరాలు

ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతా విధులను సమర్థవంతంగా నిర్వహించిన టూటౌన్ సీఐ ఎన్‌హెచ్. విజయానంద్, ఎస్సై షేక్ శంకర్, రాజాం చోరీ కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన రాజాం ఎస్సై వై.రవికిరణ్, అగ్నిప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సులో నుంచి ప్రయాణికులను సకాలంలో రక్షించిన ట్రాఫిక్ ఎస్సై ఏఎం.రాజు, హెచ్‌సీ సీహెచ్.వెంకటరావు, అగ్నివీర్ బందోబస్తును సమర్థంగా నిర్వహించిన ఆర్ఎస్సై ఎ.రామకృష్ణ, వివిధ కేసులను ఛేదించడంలో పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించిన టూటౌన్ హెచ్‌సీ టీవీఆర్‌కేవీ.ప్రసాద్, కానిస్టేబుల్స్ ఎం.వాసు, ఎం.గణేష్, బొబ్బిలి కానిస్టేబుల్స్ జి.శశిభూషణరావు, పి.లక్ష్మణరావు, తెర్లాం కానిస్టేబుల్ ఎస్. ఢిల్లీశ్వరరావు, గజపతినగరం కానిస్టేబుల్స్ పి.సత్యనారాయణ, ఎస్.శ్రీహరి, ఎస్బీ కానిస్టేబుల్ జె.జయకృష్ణ, రాజాం కానిస్టేబుల్స్ ఎస్.సత్యంనాయుడు, కె.సూరపునాయుడు, హెచ్‌సీ కె.రాజేంద్రలు ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

నలుగురిపై దాడి కేసు నమోదు

పార్వతీపురంటౌన్: సచివాలయ ఉద్యోగిపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జి.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేదోడు పథకంలో పేర్లు లేవని పాలకొల్లు రాము, పాండ్రంగి సంతోష్‌కుమార్, జె.జగన్నాథం, ఉద్దవోలు ఏడుకొండల వెంకటరమణలు పార్వతీపురం పట్టణ 8వ సచివాయలంలో విధులు నిర్వహిస్తున్న గొండేల శంకరరావుపై దాడిచేశారని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడిచేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రెండు దుకాణాలు దగ్ధం



కాలి బూడిదైన దుకాణాలు

రాజాం సిటీ: స్థానిక ఎన్‌టీఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి ఆర్పకుండా చెత్తకుప్పపై పడేయడంతో మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో సెల్ రిపేరింగ్ సెంటర్‌తోపాటు కొబ్బరి బొండాల దుకాణం కాలిబూడిదయ్యాయి. కాంప్లెక్స్‌లో మంటలు వస్తుండడాన్ని గమనించిన కానిస్టేబుల్ ఆర్.రవి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తినష్టం సంభవించిందని ఫైర్ ఎస్సై టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు.

వెస్ట్‌జోన్ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంఆర్ కాలేజీ విద్యార్థిని



కల్యాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు

విజయనగరం అర్బన్: విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకు జరిగే వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి విజయనగరం పట్టణానికి చెందిన మహారాజా అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ కల్యాణి ఎంపికైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఆంధ్రయూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి రిపబ్లిక్ డే పరేడ్ ఎంపిక ప్రక్రియలో అన్ని విభాగాల్లో మెరిట్ సాధించిన ఐదుగురిలో కల్యాణి ఒకరని పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రయూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ నుంచి ఎంపిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు దుస్తులు, బూట్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా పీఓ జి.చంద్రశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కళాశాల పీఓలు ఎం.శ్రీకాంత్, సీహెచ్.చిన్నంనాయుడు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎ.కల్యాణ్ అశోక్, కన్వీనర్ ఎస్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

ఉమ్మడి జిల్లా వాసులకు..
జీవన సాఫల్య పురస్కారాలు



పద్మశ్రీ యడ్ల గోపాలరావు



అట్టాడ అప్పల నాయుడు

రాజాం/పార్వతీపురంటౌన్: వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారాల ప్రదానంలో భాగంగా 2023వ సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ కళాకారుడు, ఓ రచయిత ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వాసుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన పౌరాణిక రంగస్థల కళాకారుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావును వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. రంగస్థల కళాకారుల విభాగంలో గోపాలరావుకు ఈ అవార్డు దక్కింది. 6 వేలకుపైగా పౌరాణిక నాటకాలు ప్రదర్శించిన ఆయన కలియుగ నక్షత్రక బిరుదును పొందారు. కృష్ణుడిగా, రాముడిగా, నక్షత్రకుడు, నారదుడి పౌరాణిక పాత్రలు వేసే గోపాలరావుకు నక్షత్రక పాత్ర దేశంలో ఎంతో ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 2020లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో యడ్లను సత్కరించగా, తాజాగా వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు రావడంతో గోపాలరావు కుటుంబసభ్యులు సంబరాలు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు ఈమేరకు సమాచారం వచ్చిందని, నవంబర్ 1న ఈ అవార్డు తనకు ఇవ్వనున్నట్లు గోపాలరావు తెలిపారు. తన భార్య జయలక్ష్మితో పాటు కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే కళారంగంలో తాను రాణించగలిగానని ఆయన అన్నారు.

సాహిత్య విభాగంలో రచయిత అట్టాడ అప్పలనాయుడు

కొమరాడ మండలం గుమడ అగ్రహారానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త అట్టాడ అప్పలనాయుడు వైఎస్సార్ లైఫ్‌టైం ఎచ్చీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 1953 ఆగస్టు 23వ తేదీన జన్మించారు. బ్యాంకులో ఉద్యోగ రీత్యా శ్రీకాకుళంలో స్థిరపడ్డారు. ప్రస్తుతం రిటైర్ అయ్యారు. శ్రీకాకుళ పోరాట ఉద్యమం సమయంలో సాహిత్యంలో ప్రవేశించిన అప్పలనాయుడు పోడు-పోరు కథా సంపుటి సహా ఇప్పటివరకు 100కు పైగా కథలు రాశారు. ఐదు కవితా సంపుటాలు ప్రచురించారు. నాటికలు, నాటకాలు రాయడం ఆయనకు అలవాటు. ఆయన రచించిన 'వారి మడిసెక్క' నాటకం జాతీయ స్థాయి ఆకాశవాణి పోటీల్లో ప్రథమ బహుమతి, నంది నాటక పోటీల్లో ఉత్తమ నాటకంగా పురస్కారం అందుకుంది. కళారత్న వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు ఆయన పొందారు. కథానిలయం బోర్డు సభ్యుడిగా, ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2023 వైఎస్సార్ లైఫ్ ఎచీవ్‌మెంట్ పురస్కారానికి సాహిత్య విభాగంలో ఆయన ఎంపిక కావడంతో పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా ర చయితలు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

పోక్సో కేసుల్లో నిందితులకు శిక్ష పడాలి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక



సమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తు చేయాలని, సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఆమె నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోక్సో కేసుల్లో దర్యాప్తు క్షుణ్ణంగా చేయాలని, అవసరమైన కేసుల్లో బాధితులకు కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. వివిధ పోలీసు స్టేషన్‌లలో రౌడీషీటర్లపై నమోదైన కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆయా కేసులను ప్రాధాన్యతా కేసుల జాబితాలో చేర్చి, నిందితులుగా ఉన్న రౌడీషీటర్లకు న్యాయస్థానాల్లో శిక్షలు పడే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని, మోటార్‌వెహికల్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ చలానాలను విధించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపైనా, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపైనా చర్యలు చేపట్టాలని సూచించారు. వైట్ కాలర్ నేరాలైన చీటింగ్, నమ్మక ద్రోహం కేసుల్లో దర్యాప్తు క్షుణ్ణంగా చేపట్టాలని, మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి

దొంగతనాలు జరగకుండా రాత్రి పెట్రోలింగ్, గస్తీని ముమ్మరం చేయాలని, ఏటీఎం కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుల కంపెనీ ఎం.డికి ఏడాది జైలు శిక్ష

- రూ.20 వేల జరిమానా

విజయనగరం ఫోర్ట్: నాణ్యత లేని మందులు తయారు చేసిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఏడాది పాటు జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. వివరాలిలా ఉన్నాయి. రాజాం పట్టణంలోని ఉమా మెడికల్ సెంటర్‌లో 2015లో అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.కృష్ణ డెలకర్ ఫోర్టే టాబ్లెట్‌ను శాంపిల్ తీసి డ్రగ్ కంటోల్ ల్యాబొరేటరీ (హైదరాబాద్)కి పంపించారు. అక్కడ పరీక్షలో ఆ మందు నాసిరకం దని తేలింది. దీంతో రాజాం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పీఎస్‌వీబీ కృష్ణ సాయి తేజ నాసిరకం మందులు తయారీ చేసిన ఆస్కి ఫార్మా స్యూటికల్ కంపెనీ(చైన్నై) మేనేజింగ్ డైరెక్టర్ ఏడాది పాటు జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యకుమార్ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

శరీర దానం పట్ల అవగాహన అవసరం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: శరీరదానం, అవయవ దానం పట్ల ప్రజలకు అవగాహన అవసరమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం శరీరదానం, అవయవదానంపై వైద్యవిద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు వైద్య బోధనకు పార్థివ దేహాలు చాలా అవసరమని తెలిపారు. మనిషి మృతి చెందిన తర్వాత శరీర దానంతో పాటు బ్రెయిన్ డెడ్ అయినప్పుడు అవయవదానం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో భారత దేశం చాలా వెనుకబడి ఉందని చెప్పారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతే దేశంలో శాంతి, సుస్థిరత నెలకొంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలా సునందిని, అనాటమీ హెచ్‌డీ డాక్టర్ వాసంతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ.రమణ, బ్రహ్మకుమారి రామేశ్వరి, సావిత్రి బాపూలే ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో విజయోత్సవాలు



డీసీసీబీ చైర్మన్‌కి మిఠాయి తినిపిస్తున్న బ్యాంక్ సీఈఓ, అధికారులు

- రూ.2 వేల కోట్లు దాటిన టర్నోవర్
- 10 బ్రాంచిలలో ఈ-స్టాంపింగ్ సేవలు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) వ్యాపార లావాదేవీల టర్నోవర్ రూ.2 వేల కోట్ల మైలురాయి దాటిన సందర్భంగా గురువారం స్థానిక బ్యాంక్ కార్యాలయంలో విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తొలుత డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడికి సీఈఓ కె.జనార్దన, బ్యాంక్ అధికారుల బృందం, సిబ్బంది మిఠాయి తినిపించారు. అనంతరం ఆయన బ్యాంక్ సీఈఓ, తదితర అధికారులను అభినందించారు. అనంతరం జిల్లాలోని 24 బ్రాంచిలలో తొలివిడతగా 10 బ్రాంచిలలో ఈ-స్టాంపింగ్ సేవలను ప్రారంభించిన తరువాత చైర్మన్ వెంకట చినరామునాయుడు మాట్లాడుతూ రైతులకు రుణాలు అందించడంలోనూ రికవరీలోనూ సిబ్బంది క్రమశిక్షణ, లక్ష్యసాధనతో నిర్వహించిన విధుల తీరును ప్రశంసించారు.

అవసరానికి రుణాల మంజూరు

కార్యక్రమంలో సీఈఓ కె.జనార్దన్ మాట్లాడుతూ రైతుకు అవసరమైన సమయంలో వ్యక్తిగత, గృహ నిర్మాణ, గృహ తనఖా, మరమ్మతు రుణాలు, బంగారు ఆభరణాల తనఖా, స్వయం, సహాయక బృందాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న వివిధ ప్రాయోజిత పథకాలకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. లబ్ధిదారుల నుంచి రికవరీ కూడా సమయానుకూలంగా చేస్తూ బ్యాంకింగ్ సేవలలో మెరుగైన విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. 2024 మార్చి 31 నాటికి రూ.2,500 కోట్లు వ్యాపార లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎంలు, ఏజీఎంలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీ ఆక్వా పరిశ్రమ మూసివేత

పూసపాటిరేగ: మండలంలోని గైతుల చోడవరంలో గల సీపీ ఆక్వాపరిశ్రమను గురువారం తాత్కాలికంగా మూసివేశారు. ముడిసరుకు అధిక ధర కారణంగా పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయినట్లు సంబధిత వర్గాల సమాచారం. ముడిసరుకు ధర పెరిగినా, రొయ్యిల ధర మాత్రం గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో ఈ దుస్థితి తలెత్తింది. ఈనేపథ్యంలో గత రెండు నెలలుగా పరిశ్రమలో ఉత్పత్తి ఆగింది. దీనిలో భాగంగా పరిశ్రమలో ఒక విభాగంలో పనిచేసే కార్మికులను మరో విభాగంలోకి పంపించడానికి యాజమాన్యం చేసిన ప్రయత్నంతో కార్మికులు తిరుగుబాటు చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులు నిరసనలు చేపట్టి ధర్నాకు దిగిన ఫలితంగా పరిశ్రమ మూతపడింది. పరిశ్రమలో ఒప్పంద ప్రాతిపదికన 450 మంది కార్మికులు పనిచేయగా, 270 మంది శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. కార్మికనేతలు, యాజమాన్య ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు ఫలించలేదు. దీంతో పరిశ్రమ మూసివేత ఎన్నాళ్లు కొనసాగుతుందనే ఆందోళన కార్మికుల్లో నెలకొంది.

ట్రాక్టర్ ఢీకొని సర్పంచ్ భార్య మృతి

- సర్పంచ్‌కు గాయాలు



మృతిచెందిన సరస్వతి(ఫైల్)

దత్తిరాజేరు: విజయనగరం మండలం ముడిదాం గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దత్తిరాజేరు మండలం కన్నాం గ్రామ సర్పంచ్ చుక్క సన్యాసి నాయుడు భార్య సరస్వతి(63)అక్కడికక్కడే మృతి చెందింది. సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. సర్పంచ్ దంపతులు గురువారం స్వగ్రామం నుంచి వైజాగ్‌కు కారులో వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని, సర్పంచ్‌ను సర్వజన ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ దంపతుల కుమారుడు కెనడాలోను, కుమార్తె వైజాగ్‌లో నివాసం ఉంటున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండడలంలోని రావివలస గ్రామానికి చెందిన కొప్పిశెట్టి అప్పలరాము రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు రైల్వే హెచ్‌సీ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు



గుమ్మలక్ష్మీపురం: గాయపడిన సాగర్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎగువతాడికొండ గ్రామానికి చెందిన యువకుడు సాగర్ ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆ యువకుడు గురువారం కిసర గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కుక్కిడి గ్రామ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలతో ఉన్న సాగర్‌ను చూసిన డుమ్మంగి గ్రీన్ అంబాసిడర్ పండయ్య, తదితరులు భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి..



రాజాం సిటీ: జనార్దనరావు మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధిలోని గురవాం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిలిస్టు మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఏఎస్సై అల్లు లక్ష్మునాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలం బూడ సింగిపేట గ్రామానికి చెందిన ముద్రగడ జనార్దనరావు (45) రేగిడి మండలం బూరాడ పీహెచ్‌సీ సమీపంలో గుడారం వేసుకుని ఆయుర్వేద మందుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే తన ద్విచక్రవాహనంపై రాజాం వెళ్తుండగా పాలకొండ నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో రోడ్డుపై తుళ్లిపడిన జనార్దనరావు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయిలో 'విజయ దుందుభి'

- సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు
- ప్రథమస్థానం సాధించిన బాలికలు
- తృతీయ స్థానంలో బాలురు



సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు



తృతీయ స్థానం సాధించిన బాలుర జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి 10వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా పేరు మార్మోగింది. ఈ పోటీల్లో జిల్లా బాలికలు, బాలుర జట్లు సత్తా చాటాయి. ఈ నెల 16 నుంచి 18వరకు మూడు రోజులపాటు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరగ్గా జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానం సాధించింది. అలాగే బాలుర జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో జిల్లా బాలికలు, బాలుర జట్లు లీగ్ మ్యాచ్‌ల్లో మంచి ప్రతిభ కనబరిచి ఫైనల్ పోటీలకు చేరుకున్నాయి. ఫైనల్ పోటీల్లో జిల్లా బాలకల జట్టు ప్రథమస్థానం సాధించగా, ద్వితీయ స్థానాన్ని అనంతపురం జిల్లా, తృతీయ స్థానాన్ని వైఎస్సార్ కడప జిల్లా జట్టు దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానాన్ని సాధించగా, గుంటూరు జట్టు ప్రథమ స్థానాన్ని, కర్నూలు జిల్లా జట్టు ద్వితీయ స్థానం చేజిక్కించుకున్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరు కనబరిచి పతకాలు, షీల్డ్ సాధించిన జిల్లా జట్ల క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల పీడీలు అభినందించారు.

22న మెగా రక్తదాన శిబిరం



వాక్ ఫర్ విజయనగరం ర్యాలీ టీ షర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

- అదేరోజు వాక్ ఫర్ విజయనగరం ర్యాలీ
- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: సిరుల తల్లి పైడితల్లమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా ఈనెల 22న విజయనగరం జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు. నగరంలోని అన్ని స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్ బ్యాంక్‌ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం నగరంలోని రింగ్‌రోడ్‌లో గల సుజాత కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెగా రక్తదాన శిబిరానికి ముందుగా ఉదయం స్థానిక రాజీవ్ క్రీడామైదానం నుంచి నిర్వహించే వాక్ ఫర్ విజయనగరం ర్యాలీలో పాల్గొనే వారి కోసం రూపొందించిన టీ షర్టులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైడితలమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛంద సంస్థలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు ఆధ్వర్యంలో 22వ తేదీన స్థానిక చాసో స్మారక భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని, రక్తాన్ని దానమిచ్చి ప్రాణదాతలుగా మారాలని కోరారు. సమావేశంలో కార్యక్రమ నిర్వాహకులు పద్మనాభం, ప్రవీణ్ అంచాలయా, తిరుపతిరావు పాల్గొన్నారు.

880 లీటర్ల సారా, కారు సీజ్

- ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారా రవాణాను అరికట్టేందుకు పార్వతీపురం మండలంలోని రంగాలగూడ గ్రామ సమీపంలో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 880 లీటర్ల సారాతో ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఉపేంద్ర మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని అలమండ నుంచి పార్వతీపురం మైదాన ప్రాంతానికి సారా రవాణా అవుతోందన్న ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించామని తెలిపారు. కొమరాడ మండలం పూడేసు గ్రామానికి చెందిన ఆరిక నరేష్, పార్వతీపురం పట్టణానికి చెందిన సిరిపురపు నారాయణ ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా సారా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వారికి సారా సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రంలోని అలమండకు చెందిన బెవర శరత్‌పై కూడా కేసు నమోదు చేశామని, నరేష్, నారాయణలను రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. దాడుల్లో ఎస్సై వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



గంట్యాడ: మద్యం తరలిస్తూ పట్టుబడిన వ్యక్తులు

100 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

గంట్యాడ: మండలంలోని బుడతనాపల్లి గ్రామం వైపు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొఠారుబిల్లి జంక్షన్ సమీపంలో పోలీసులు ఇద్దరు వ్యక్తులను మద్యం సీసాలతో పట్టుకున్నారు. మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ, బాడంగి మండలానికి చెందిన తోట దుర్గారావు కొఠారుబిల్లి జంక్షన్ నుంచి బైక్‌పై అక్రమంగా 100 మద్యం సీసాలు తరలిస్తుండగా గోకులం లేవుట్ సమీపంలో బంగారమ్మ గుడి దగ్గర పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు హెచ్‌సీ జె. శ్రీనివాసరావు తెలిపారు.

రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని మోసం

విజయనగరం క్రైమ్: రైల్వేశాఖలో ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి కుటుంబ సభ్యుల వద్ద లక్షల రూపాయలు మింగేసిన వారిపై ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన వాకాడ పూజకు వరసకు పెద్దమ్మ, అయిన జోగి సూర్యకాంతం, ఆమె కుమారుడు హరికృష్ణ రై ల్వేలో ఉద్యోగం చే స్తు న్నారు. రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని పూజ, వారి కుటుంబ సభ్యులను నమ్మబలికి తల్లీకొడుకులు దప దఫాలుగా వారి నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఉద్యోగం లేక పోగా, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు పూజ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.